# అవస్థల జీవనం!

- అన్నింటికీ రోడ్డే ఆధారం
- క్రీడామైదానాలు కరవు
- రోడ్ల మధ్యలో స్తంభాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు


ఇళ్ల మధ్యన రోడ్డుపై క్రికెట్ సాధన చేస్తున్న చిన్నారులు


ఫుట్‌పాత్‌లపై దుకాణాలు

**గాజువాక:** క్రికెట్ ఆడాలంటే రోడ్డే ఆట స్థలం.. గొంతు తడిపే గొట్టపు బావికి రహదారే ఆధారం. ప్రమాదకర విద్యుత్ హైటెన్షన్ టవర్‌కు రోడ్డే దిక్కు. ఇదీ మహానగరంలో దుస్థితి. వేటికీ స్థలాలు దొరకవు. ఉన్నా అంత ధర చెల్లించి కొనలేని పరిస్థితి. చివరకు ప్రభుత్వ, ప్రజోపయోగ కార్యక్రమాలకు కూడా స్థలాలు కరువు. గాజువాకలో ఈ పరిస్థితి మరీ ఎక్కుగా ఉంది. 20వ వార్డులతో విస్తరించి ఉన్న గాజువాకలో స్థలాలు లేక ప్రభుత్వ కట్టడాలు, ప్రజావసరాలు అన్నీ రోడ్లమీదే కొనసాగుతున్నాయి. కొండ శిఖరమైనా, గెడ్డైనా వారికి లెక్కలేదు. కనిపిస్తే ఆక్రమణే మరి. ఈ పరిస్థితిని మార్చాల్సిన అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి.

**కొండెక్కుతున్న నివాసాలు**

గాజువాకలో నివాసాలకు సరైన స్థలాలు లేవంటూ అంతా కొండలు ఎక్కుతున్నారు. రాత్రికి రాత్రే పక్కా షెడ్లు వేసి స్థిర నివాసాలు ఏర్పరచుకొంటున్నారు. మొత్తం ఎనిమిది కొండలు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. కింద నేలపై చోటు లేకపోవడంవల్ల కొండలను ఆశ్రయించామంటూ నివాసితులు పేర్కొంటున్నారు.

**రోడ్డుమీదే సిక్సర్లు**

ఎంతో ఎదుగుతున్న గాజువాకలో సరైన క్రీడా ప్రాంగణం లేదు. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు ఉన్నా ఈ లోటు లోటుగానే మిగిలింది. దీంతో ఔత్సాహికులు నడిరోడ్లను క్రీడా మైదానం చేసుకొని ప్రాక్టీస్ చేస్తున్నారు.

**ఫుట్‌పాత్‌లు వ్యాపార కేంద్రాలు**

కొత్తగాజువాక నుంచి పాతగాజువాక వరకు ఉన్న మెయిన్ రోడ్డు ఫుట్‌పాత్‌లు వ్యాపారాలకు కేంద్రంగా మారాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఫుట్‌పాత్‌లు రెడీమేడ్ వ్యాపారులు, చెప్పుల దుకాణాలు, పండ్ల వ్యాపారాలకు వేదికవుతున్నాయి. వంటిల్లు జంక్షన్ నుంచి గోపాలరెడ్డినగర్ వరకు, జగ్గు జంక్షన్ నుంచి గాజువాక మార్కెట్ వరకు, పాతగాజువాక నుంచి వంటిల్లు జంక్షన్ వరకు గల రోడ్ మార్జిన్‌లో లెక్కలేనన్ని ఫుట్‌పాత్ దుకాణాలు కొత్తగా పుట్టుకొచ్చాయి.

**పార్కింగ్ యార్డు కాదు**


గాజువాకను కలుపుకొని ఉన్న 18 కిలోమీటర్ల జాతీయ రహదారి పార్కింగ్ యార్డుగా తయారవుతోంది. ట్రక్ టెర్మినల్ లేకపోవడంతో ట్యాంకర్లు, టీలర్లు రోడ్లను మూసేస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు చెప్పినా వినే పరిస్థితి లేదు. ట్రక్ టెర్మినల్ నిర్మిస్తే ఇబ్బందులు తొలగుతాయి.

**రోడ్డు మధ్యలో టవర్**

గాజువాకలో వివిధ చోట్ల రోడ్ల మధ్యలోనే ప్రమాదకరమైన హెచ్‌టీ టవర్‌లు ఉన్నాయి. శ్రీనగర్‌లోని పెట్రోల్ బంక్ నుంచి అఫీషియల్ కాలనీకి వెళ్లే దారిలో, జాతీయ రహదారినుంచి మింది గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన వీధి రోడ్ మధ్యలో ప్రమాదకరంగా ఈ టవర్‌లు ఉన్నాయి. వీటి మధ్య చుట్టపక్కల కాలనీవాసులు రాకపోకలు సాగిస్తున్నాయి. ఎక్కడా స్థలం లేదని, టవర్‌లను మార్చడం సాధ్యం కాదనే కారణంతో వాటిని రోడ్ మధ్యలోనే వదిలేశారు.

**ఇంకా ఎన్నెన్నో..**

వీటితోపాటు రోడ్లమధ్యలో చాలానే ఉన్నాయి. జోగవానిపాలెం వెళ్లేదారి మధ్యలో చేతిబోరు, ఇళ్లకు వెళ్లే దారి మధ్యలో విద్యుత్ స్తంభాలు.. ఇలా అనేకచోట్ల ఆక్రమణలున్నాయి. ఆయా రోడ్లపై వాహనాలు తప్పించుకొని వెళ్లడం సాహసంగా మారుతోందని పలువురు పేర్కొంటున్నారు.


రోడ్డు మధ్యలో హైటెన్షన్ టవర్


వందడుగుల రోడ్డుపై లారీల పార్కింగ్

## క్లుప్తంగా

### జాబిలీహిల్స్ కాలనీలో సూర్య ఘర్

**అగనంపూడి:** జీవీఎంసీ 79వ వార్డు జాబిలీ హిల్స్ కాలనీలో పీఎం సూర్య ఘర్ సోలార్ పథకంలో భాగంగా పది కిలోవాట్స్ సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు కాలనీ అసోసియేషన్ ఓ ప్రైవేటు ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యంతో ఒప్పందం చేసుకుంది. రూ.6.2 లక్షల సోలార్ ప్రాజెక్టులో రూ. లక్షా 80వేల రాయితీ అందించినట్టు రిరవాన్ ప్రాజెక్టు సీఈవో చంటి బాబు తెలిపారు. జాబిలీహిల్స్ ప్రతినిధులు మురళీ, గొల్లవిల్లి వెంకటరావు, స్నేహ, దేవి, జానకీరామ్, పవన్‌మూర్తి,సూర్యచంద్రరావు, ప్రకాష్, రాము తదితరులు పాల్గొన్నారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

**అగనంపూడి:** దువ్వాడ రైల్వేస్టేషన్ గోపాలపట్నం పరిధిలో గుర్తు తెలియని మృతదేహాన్ని దువ్వాడ జీఆర్‌పీ పోలీసులు గుర్తించారు. దువ్వాడ జీఆర్‌పీ ఎస్‌ఐ లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపట్నం నుంచి దువ్వాడ వచ్చే మార్గంలో జగ్గరాజుపేటకు సమీపంలో సుమారు 40 ఏళ్ల వ్యక్తి రైల్లో ప్రయాణం చేస్తూ జారిపడి ఉంటారని, దీంతో తలకు బలమైన గాయం తగలడం వల్ల మృతిచెంది ఉంటాడని తెలిపారు. పరిసర ప్రాంతంలో మృతుని ఆచూకీ లభ్యం కాలేదని, మృతుడి కుడికాలు విరిగి ఉందని, దేహంపై సిమెంట్ రంగు టీషర్ట్, నీలంరంగు ట్రాక్ ఉందని ఆమె తెలిపారు. వివరాల కోసం దువ్వాడ జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్73820 58996 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

### ఎంవీఆర్‌లో రేపు మెగా జాబ్‌మేళా

**గాజువాక:** స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. 22 కంపెనీల్లో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను వెంటనే అందజేస్తారన్నారు. 2025 సంవత్సరంలో టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ, ఐటీఐ పాసైన అభ్యర్థులు కూడా జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు.

### రైల్వేస్టేషన్‌లో 11 కిలోల గంజాయి స్వాధీనం

**తాటిచెట్లపాలెం:** విశాఖ రైల్వే స్టేషన్‌లో శనివారం రైల్వే పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని, 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ శాంతారాం, ఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. తమిళనాడు కన్యాకుమారి జిల్లాకు చెందిన అలమీన్, అజిత్ అయ్యప్పన్‌లు విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా తమిళనాడుకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడం గుర్తించి వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.55 వేల విలువైన 11 కేజీల గంజాయిని సీజ్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

### సైబర్ నేరాలపై అవగాహన అవసరం


డాక్టర్ పట్టాభి సీతారామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు

**సీతంపేట:** ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాలపై రిటైర్డ్ ఉద్యోగులు అవగాహన పెంపొందించుకోవాలని సభాధ్యక్షుడు డీజీఎస్ జి.వాసుదేవమూర్తి సూచించారు. ఆంధ్రా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమావేశం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏజీఎస్ టి.కామేశ్వరరావు, ఈసీ మెంబర్ ఎం.సూర్యభాస్కరరావు, కోశాధికారి జి.ముత్యుంజయరావులు బ్యాంకు ఉద్యోగుల హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం, హౌసింగ్ లోన్ ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించారు. ముందుగా ఆంధ్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎం.సూర్య భాస్కరరావు, ఆర్.వి.రవికుమార్ పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధిలో స్టీల్‌ప్లాంట్‌ది కీలక భూమిక


శిబిరంలో రక్తదానం చేస్తున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, నాయకులు

**ఉక్కునగరం:** మానవ జీవనానికి రక్తం ఎంత ప్రధానమో.. రాష్ట్ర అభివృద్ధికి స్టీల్‌ప్లాంట్ అంత ముఖ్యమని కేజీహెచ్ జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ డి. రాధాకృష్ణన్ అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శనివారం స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కళాక్షేత్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. స్టీల్ సీఐటీయూ ఏడేళ్లుగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి ఆరోగ్య సమస్యలు కలగవన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించడం, స్టీల్‌ప్లాంట్‌ను రక్షించడం ద్వారా వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కలుగుతుందన్నారు. అతిథులు వై.ఎల్. నరసింహరావు, ఉక్కు ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ సారంగి మాట్లాడుతూ ఒకరు ఇచ్చే రక్తం వల్ల ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ మాట్లాడుతూ గనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం లక్ష్యంగా ఏడేళ్లుగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో 152 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్. రామారావు, వై.టి. దాస్, యు. రామస్వామి, పుల్లారావు, మరిడయ్య, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

## నీట్‌లో ప్రతిభ


దుర్గాప్రసన్న, వంశీకృష్ణ, మోక్షిత సాయి

**ఉక్కునగరం:** నీట్ ఫలితాల్లో శ్రీచైతన్య గాజువాక జోన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం రమణ తెలిపారు. శనివారం విడుదల చేసిన ఆల్ ఇండియా నీట్ ఫలితాల్లో ఆర్. దుర్గా ప్రసన్న, వంశీకృష్ణలు 299వ ర్యాంకు, పి. హేమ వర్షిణి 1155వ ర్యాంకు, ఎం. మోక్షిత సాయి 3120 ర్యాంకు, ఎస్. గీతాలత 3269 ర్యాంకు, జి. గురుకీర్తన 4369 ర్యాంకు, కె. కోమలి 4719 ర్యాంకు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభచూపిన వారిని ఎగ్జిక్యూటివ్ డీన్లు ఎస్. రఘుకుమార్, కె.బంగారు బాబు, డీన్లు, ప్రిన్సిపాళ్లు అభినందించారు.

## త్వరలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలు


డాక్టర్ శ్రీహరిరావును సన్మానిస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నాయకులు

**మహారాణిపేట:** ఆన్‌లైన్ సేవలను అభివృద్ధి చేశామని, త్వరలో వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించి వైద్యులు తమ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయడమే కాకుండా, ఫీజు కూడా చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు అన్నారు. శనివారం ఆంధ్ర వైద్య కళాశాలలో ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రెన్యువల్, రీ-రిజిస్ట్రేషన్, ఎన్‌వోసీ, గుడ్ స్టాండింగ్ సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలి సభ్యులు, రిజిస్ట్రార్ సిబ్బంది సహకారంతో రెండవ జిల్లా కేంద్ర కార్యక్రమాన్ని ఇక్కడ రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో రెన్యువల్ సమయం పూర్తయిన తర్వాత మాత్రమే రిజిస్ట్రేషన్ చేసేవారని, దేశంలో మొట్టమొదటి సారిగా అన్ని జిల్లా కేంద్రాల్లో వైద్య మండలి ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన విజయనగరం జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ రోజు విశాఖలో రెండవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. అంతే కాకుండా ఒకసారి మాత్రమే వైద్య మండలికి వచ్చి వారి వేలిముద్ర, సంతకం, ఐరిస్‌లను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తామని, జీవితంలో మళ్లీ వైద్య మండలికి రావాల్సిన అవసరం ఉండదని, ఆ తర్వాత వారు ఆన్‌లైన్ ద్వారా రెన్యువల్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య మండలి సభ్యులు డాక్టర్ కేశవరావుబాబు, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ యు. శ్రీహరి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ జె.సి. నాయుడు, అసోసియేషన్ నాయకులు డాక్టర్ పి.జె. శ్రీనివాస్, డాక్టర్ బాబూరావు, 600 మంది వైద్యులు పాల్గొన్నారు.

## సిరులతల్లికి తులసిపూజ

**డాబాగార్డెన్స్:** బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గొడుగుల పంపిణీ


గొడుగు పంపిణీ చేస్తున్న శోభారాణి

**అగనంపూడి:** పితృదినోత్సవం సందర్భంగా 79వ వార్డు అగనంపూడి సత్రం కూడలికి చెందిన మహాత్మాగాంధీ సేవా సంఘం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు శనివారం వృద్ధులకు గొడుగులు పంపిణీ చేశారు. తల్లిదండ్రులు, అవ్వాతాతలను కష్టపెట్టకుండా వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో బొర్రమాంబ పారాయణ సేవా సమితి కార్యదర్శి చిత్తా శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్


మహిళలకు రక్తహీనత పై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధి

**పెదగంట్యాడ:** జీవీఎంసీ 75వ వార్డు పరిధి నెల్లిముక్కు అంగన్‌వాడీ కేంద్రంలో సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీలక్ష్మి, కోర్డినేటర్ దివ్య ఆధ్వర్యంలో సాధారణంగా మహిళల్లో వచ్చే రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రక్తహీనత, దాని లక్షణాలు, వ్యాధిని ఏ విధంగా అరికట్టాలి అనే అంశాలతో పాటు పౌష్టికాహారం ఆవశ్యతకను వివరించారు. ఆకుకూరలు, రాగులు ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. రాగిపిండితో చేసిన లడ్డూలు ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వేణుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

## ఒకరి రక్తదానం.. మరొకరికి ప్రాణదానం


విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న క్యాడెట్లు

**డాబాగార్డెన్స్:** ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు, సిబ్బంది రక్తదానం ప్రాముఖ్యత, ప్రజల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ రక్తదానం ఇంకొకరి ప్రాణాన్ని కాపాడగలదని, ఆరోగ్యవంతమైన మువత రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఆర్. కిరణ్మయి, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె.గీతాంజలి పాల్గొన్నారు.

**రక్తదాతలు ప్రాణదాతలు..** జైభీమ్ సంస్థ ఆధ్వర్యంలో కేజీహెచ్ ఓపీ గేటుకు ఎదురుగా మైక్రో ల్యాబ్స్‌లో లయన్స్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ జీడీ బాబు రక్తదానం చేశారు. కార్యక్రమంలో న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ రమేష్‌బాబు, జై భీమ్ సంస్థ కన్వీనర్ కోన ప్రకాష్, గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి పాల్గొన్నారు.

## చౌప్పా కల్యాణ్‌కు నివాళి


కల్యాణ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు

**పెదగంట్యాడ:** కళాకారుడు చౌప్పా కల్యాణ్ సేవలు మరువలేమని వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. మండలానికి చెందిన చౌప్పా కల్యాణ్ ఈ నెల 4న శ్రీకాకుళం జిల్లా కంచిలిలో గుండె పోటుతో బుధవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన సంస్మరణ సభను స్థానిక బీసీ రోడ్డులోని దయాల్‌నగర్‌లో ఆయన స్వగృహం వద్ద శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి దేవన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అలాగే ఇటీవల మృతి చెందిన 64వ వార్డుకు చెందిన ధర్మాల సోములమ్మకు కూడా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గొందెశి శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆహారంలో పోషక విలువలు తప్పనిసరి


రక్తహీనతపై అవగాహన చార్టులు ప్రదర్శిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు


రాగిపిండితో లడ్డూలు తయారు చేయడంపై అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

**అగనంపూడి:** రాగిపిండి, బెల్లంతో తయారు చేసిన పదార్థాల్లో ఎక్కువ పోషకాలు ఉంటాయని, ఇవి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరగడానికి దోహదపడతాయని సృజనా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జ్యోతిశ్రీ, అనుశ్రావణి అన్నారు. 88వ వార్డు జేఎన్ఎన్‌యూఆర్ఎంకాలనీలో సృజనా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తహీనత, తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పౌష్టికాహార లోపం వల్ల ఎక్కువగా రక్తహీనత కలుగుతుందని, దీని వల్ల బాలలు, అన్ని రంగాల్లో వెనుకబడిపోతున్నారని వివరించారు. తరువాత రాగి పిండితో లడ్డూలు తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమం కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గురువుల ఆరాధనోత్సవాలు


లలితాపీఠంలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు


అవ్యక్తానంద మహరాజ్‌కు అర్చన చేస్తున్న ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి

**సీతంపేట:** అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో గురువుల ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. లలితాపీఠం ద్వితీయ పీఠాధిపతి అవ్యక్తానంద మహరాజ్ జయంతి సందర్భంగా మూడు రోజుల పాటు ఈ ఆరాధనోత్సవాలు జరగనున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా శనివారం పీఠం ఆవరణలోని అవ్యక్తానంద మహరాజ్ విగ్రహానికి విశేష అభిషేకం, అర్చనలు నిర్వహించారు. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి స్వయంగా పూజలు చేసి, అనంతరం భక్తులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం పీఠంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.